క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. పట్టణంలోని ఏకలవ్య బొమ్మ సెంటర్, రాజశ్రీ వక్కపొడి ఫ్యాక్టరీ నుంచి ఉప్పూడి రోడ్డు వరకు ఉన్న రహదారికి ఇరువైపుల, పోస్ట్ ఆఫీసు నుంచి రైల్వేస్టేషన్, దర్గా నుంచి నేతాజీనగర్ వరకు కోత ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు, యడ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఉదయం10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

చుండూరు(వేమూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివరాం చుండూరు మండలంలోని యడ్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు.

14న 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

పిట్టలవానిపాలెం: మండలంలోని పోతనకట్ల వారిపాలెంలో ఈనెల 14వ తేదీన ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని చెప్పారు.

రేపు పోలు రాధా ఎడ్ల పోటీలు

భట్టిప్రోలు: శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి(భట్టిప్రోలు) ఆధ్వర్యంలో మండల స్థాయి పోలు రాధా ఎడ్ల పోటీలు ఈ నెల 12వ తేదీ స్థానిక మార్కెట్ యార్డ్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11వ తేదీలోగా పోటీదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతుల కింద రూ.15,116, రూ.10,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116 అందించనున్నట్లు తెలిపారు. పోటీలు డ్రా పద్ధతిలో నిర్వహిస్తామని, టైరు బండి తోలుకునే ఎద్దుల వరకు ఈ పోటీలలో అనుమతించబడునని పేర్కొన్నారు. 100 కిలోల బరువును 6 నిముషాలలో ముగించాలని, ముళ్ల కర్ర వాడరాదని, కొరడాలు మాత్రమే వాడాలని, మధ్యలో దిగి తోలకూడదని తెలిపారు. వివరాలకు 63006 53089, 96182 06050 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక కృష్ణా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వేమూరు ఎస్ఈబీ సిబ్బంది కొల్లూరు సమీపంలోని క్రాప అడ్డరోడ్డు వద్ద అడ్డగించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండటంతో కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేశారు. ఎస్ఈబీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

కొల్లూరు: గ్యార్మీ వేడుకలు కొల్లూరులో ఘనంగా నిర్వహించారు. జెండా చెట్టు వద్ద నుంచి గురువారం రాత్రి జెండాను గ్రామంలోని పుర వీధులలో ఊరేగించారు. శుక్రవారం స్థానిక జెండా చెట్టు వద్ద అన్నదానం చేశారు.

వలివేరులో ముగిసిన పూజా మహోత్సవాలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం వలివేరులో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో అష్టాక్షరి హోమ మహా మంత్రం, లక్ష్మీనారాయణ మహా సుదర్శన హోమం సహిత లక్ష తులసీ దళాల అర్చన మహోత్సవం కనుల పండువగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో చీడేపూడి సాంబిరెడ్డి–భూలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలనుస్వామి వారి భక్త బృందం, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నిర్వహించగా కార్యనిర్వాహణాధికారి ఎం.వీ రారెడ్డి పర్యవేక్షించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

– డీడీ విజయనిర్మల



కర్లపాలెం: వరిసాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పండించాలని జిల్లా అగ్రి కల్చర్ డెప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలోనూ, బుద్ధాం గ్రామంలో జరిగిన పొలంబడి కార్యక్రమాలలో డీడీ విజయనిర్మల పాల్గొని రైతులకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.లక్ష్మి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాధాకృష్ణ, ఏవో సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు బాజీ, గోపీ, సునీత, శివనాగరాజు, తిరుమలేష్ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- అందుకే మళ్లీ..... జగనే కావాలి
- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- పీవీ పాలెంలో ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలి కార్యక్రమం

పిట్టలవానిపాలెం: రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే సంక్షేమ పథకాల సొమ్ములు జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ అవసరమని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సదస్సుకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.4 లక్షల 6 వేల కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తు చేశారు. గ్రామానికి నాలుగేళ్ల ఎనిమిది నెలల కాలంలో రూ.19 కోట్ల 60 లక్షలు వివిధ సంక్షేమ పథకాల రూపంలో అందించినట్లు పేర్కొన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. గ్రామ సచివాలయం వద్ద నవరత్నాల లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి యేట్ర అశ్వినిరెడ్డి, యేట్ర శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు సీతారామరాజు, కృపానందం, ఆయా గ్రామాల సర్పంచులు మంతెన గంగరాజు, శ్యామల నాగిరెడ్డి, చేబ్రోలు వీరయ్య, మండే విజయ్ కుమార్, బి.ప్రకాశరావు, పార్టీ నాయకులు కె. దేవేంద్రరాజు, ఎ.కోటేశ్వరరావు, ఎ.సురేష్, కె.ప్రసన్నరాజు, టి. శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కర్లపాలెంలో..

కర్లపాలెం: సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తరువాత ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసినందుకే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ మనకు ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. నల్లమోతువారిపాలెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి కోన ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే కోన పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, సొసైటీ అధ్యక్షుడు మరకా పెద వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు తాండ్ర సాంబశివరావు, అమీర్‌బేగ్, ఆసిఫ్ అలీ, సర్పంచ్‌లు దబ్బుకూటి ఏడుకొండలు, నాదెండ్ల భానుప్రసాద్, నాయకులు కుంటా రత్నబాబు, సూరయ్య, కంకిపాటి నాగరాజు, షేక్ తాజుద్దీన్ ఉన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోన, పార్టీ నాయకులు



కొల్లూరులో ఇంటింట ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



భట్టిప్రోలు-2సచివాలయంలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లలిత కుమారి

పిట్టువారిపాలెంలో..

పిట్టువారిపాలెం(పిట్టలవానిపాలెం): గ్రామ సచివాలయ వ్యవస్థతో ఏపీ రూపురేఖలు మారిపోయాయని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని పిట్టువారిపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి యేట్ర అశ్విని రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు.. వైఎస్సార్ సీపీతోనే

కొల్లూరు: సంక్షేమ పథకాల అమలు జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యపడతాయని కొల్లూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ అన్నారు. శుక్రవారం కొల్లూరు సచివాలయం–1 పరిధిలోని బ్రహ్మంగారి గుడి ప్రాంతంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఈఓపీఆర్డీ రవిబాబు, ఈఓ మల్లికార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు చిలకా ప్రకాశం, నర్ర బుల్లిబాబు, కూచిపూడి మోషే, బొర్రా నాగేశ్వరరావు, పొలిమేర నవీన్‌రెడ్డి, పోతురాజు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు–2 సచివాలయంలో..

భట్టిప్రోలు: భట్టిప్రోలు–2 సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరి, సర్పంచి దారా రవి కిరణ్మయిలు, ఉప సర్పంచి బూర్లె రామప్రసాద్, మండల జేఏసీ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, పీజీ అరుణ్‌శాస్త్రి, మోర్ల కోటేశ్వరరావు, తలకొల యలమంద. వేల్పూరి చిన్నారి, ఎంఎ రహమాన్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, ఈఓపీర్డీ టి.ఊహారాణి పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో..

చెరుకుపల్లి: జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ అన్నారు. సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం సాయత్రం ప్రారంభించారు, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, సర్పంచి దేవరకొండ వాణి, బండారు రామారావు, యెల్లెల రవికిరణ్, పంచుమర్తి చిన వెంకట సుబ్బారావు, బర్మా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నాగుల నరసింహారావు పాల్గొన్నారు.



మోదుకూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణమ్మ



అమృతలూరులో బోర్డు ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజాంపట్నంలో..

నిజాంపట్నం: వ్యవసాయానికి అండగా, అభివృద్ధికి బాసటగా నిలిచిన వైఎస్ జగన్ తిరిగి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు పెద్ద ఎత్తున కోరుకుంటున్నారని ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి హరనాథబాబు తెలిపారు. నిజాంపట్నంలోని సచివాలయం–2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, బోటు ఒనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ సంక్షేమ లబ్ధి

మోదుకూరు(వేమూరు): సంక్షేమ పథకాల అమలుతో పేదలకు లబ్ధిచేకూరిందని ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. చుండూరు మండలంలో మోదుకూరు గ్రామంలో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం ప్రతి ఇంటికి అందించిన నగదు బదిలీ గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఎం.శాలీ, ఎంపీటీసీ కొల్లి సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు అన్నపురెడ్డి రఘురామిరెడ్డి, గ్రామ సచివాలయం కన్వీనర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గాదె శివరామ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

అమృతలూరులో..

అమృతలూరు(వేమూరు): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని సర్పంచి దేవర కొండ రాము అన్నారు. అమృతలూరు మండల కేంద్రంలో గ్రామ సచివాలయం–2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు బట్టు మోషే, పార్టీ గ్రామ అధ్యక్షులు అంబటి రామోహనరావు, ఎ.వెంకయ్య, కె.రాంబాబు పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రత్న ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీటీసీ మోపిదేవి హరనాథబాబు

భవిష్యత్ తరాలకు జగనన్న అవసరం

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తదితరులు

రేపల్లె: రాష్ట్ర అభివృద్ధికి, భవిష్యత్ తరాల ప్రజలకు ముఖ్యమంత్రి జగనన్న సేవలు ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని 20, 21వార్డుల సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పేద ప్రజల సంక్షేమం కోసం పరితపించిన ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో ప్రజలు పొందిన లబ్ధిని తెలియజేసే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్‌లు బట్టు శ్వేత, సయ్యద్ రహమ్మత్ పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు

నగరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో సంక్షేమ ఫథకాలు ప్రజల ఇంటి ముంగిటకు చేరుతున్నాయని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. మండలంలోని అల్లపర్రు గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ డాక్టర్ రాజా, గ్రామ సర్పంచి షేక్ షెహనాజ్‌సుల్తానా, సచివాలయ కన్వీనర్లు రమణారావు, రామారావు, నోడల్ ఆఫీసర్ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

వెల్లటూరు హైస్కూల్‌లో నమూనా అసెంబ్లీ ఎన్నికలు

వెల్లటూరు(భట్టిప్రోలు): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నమూనా అసెంబ్లీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, ఎస్‌కే సుభానీ పర్యవేక్షణలో విద్యార్థులు పాల్గొన్నారు. ఓటును అమ్ముకోవద్దు.. కష్టాలను కొని తెచ్చుకోవద్దు.. అంటూ అభ్యర్థులు ప్రచారం చేశారు. నామినేషన్ ప్రక్రియ, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, పరిష్కారాలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను పోటీ చేస్తున్న అభ్యర్థులను విలేకరులు అడగడం, అభ్యర్థుల ప్రచారం, ఓటింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలను నమూనా ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం ప్రాముఖ్యత, ప్రభుత్వాల ఏర్పాటు, స్థానిక సంస్థల ఎన్నికలు, నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణకుమారి తెలిపారు. ఎన్నికల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి సుధాకర్, కృష్ణయ్య, ఎస్టేట్ బాబు, రామారావు, శివరామకృష్ణ, కుటుంబరావు, హరిప్రసాద్, ఆషాలత, శైలజ పాల్గొన్నారు.



నమూనా అసెంబ్లీ ఎన్నికల్లో టు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థిని

పథకాలతో ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి

భట్టిప్రోలు: స్వయం సహాయక సంఘాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి కోరారు. మండల మహిళా సమాఖ్య వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. బాపట్ల జిల్లా స్త్రీ నిధి ఏజీఎం, మండల మహా సభ అధికారి కాల్వ నాగబాబు మాట్లాడుతూ చిన్న, గ్రామ సంఘాలు మండల సమాఖ్యలో తప్పని సరిగా ప్రతి రెండేళ్లకు నాయకత్వ మార్పిడి జరగాలన్నారు. కార్యక్రమంలో రేపల్లె క్లస్టర్ ఏరియా కో–ఆర్డినేటర్ పుసులూరి రమాదేవి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, స్త్రీ నిధి మేనేజర్ పి.అశోక్, ఈఓపీఆర్డీ టి.ఊహారాణి, సీసీలు కొలకలూరి రజనీ కుమారి, కొండెపాటి సాంబయ్య, దాసరి హనోకు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి, పక్కన జెడ్పీటీసీ ఉదయభాస్కరి, రమాదేవి

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల అర్బన్: హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో హమాలీ కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించడంలో పౌరసరఫరాల శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రతినెల మొదటి వారంలో హమాలీలకు బిల్లులు ఇవ్వాలని, ప్రతినెల 20వ తేదీ తర్వాతనే బిల్లులు వస్తున్నాయన్నారు. దీనివల్ల హమాలీ కుటుంబాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న హమాలీలకు ఎటువంటి భద్రతా లేదని, హమాలీలకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీలను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, కొత్తగా చేరిన హమాలీల పేర్లను చేర్పు చేయాలని కోరారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల జిల్లా కలెక్టర్ (జాయింట్ కలెక్టర్) పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కార్యాలయాల్లో అందించారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.రత్నరాజు, వీరాంజనేయులు, యోహాను, యేసు, నాగరాజు, సీఐటీయూ బాపట్ల పట్టణ కార్యదర్శి జె.శామ్యూల్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

ఎస్పీని సన్మానించిన బాధితుడి తల్లిదండ్రులు



బాపట్లటౌన్: హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చేసిన ఎస్పీ వకుల్ జిందాల్‌కు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని కర్లపాలెం మండలం, పేరలి గ్రామంలో 2017 ఫిబ్రవరి 7న గొర్రుముచ్చు రవికుమార్‌ను అతి కిరాతకంగా హత్యచేసిన మేకల ఫ్రాంక్లిన్‌రాజుకు ఇటీవల బాపట్ల 6వ అదనపు కోర్టు జడ్జి యావజ్జీవ కారాగార శిక్ష విధించిన సంగతి విదితమే. ముద్దాయికి శిక్షపడేలా కృషిచేసిన పోలీసులకు శుక్రవారం మృతుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. దానిలో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మృతుడి తల్లిదండ్రులు రమేష్, లాజరమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో బాపట్ల రూరల్ సీఐ జి. వేణుగోపాలరెడ్డి, కర్లపాలెం ఎస్ఐ శివయ్య పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బాపట్ల అర్బన్: స్థానిక శాఖా గ్రంథాలయం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా శాఖా గ్రంథపాలకుడు ఎ.శివాజీగణేష్ శుక్రవారం తెలిపారు. వారోత్సవాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం కోరారు. వారోత్సవాలు సందర్భంగా 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న వ్యాసరచన పోటీలు, 17న డిబెట్, 18న చిత్రలేఖనం, 19న మహిళా దినోత్సవం, 20న విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

అమృతలూరు(వేమూరు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అమృతలూరు గ్రంథాలయ ఇన్‌చార్జి పి.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు.

రైతులు పంట నమోదు పత్రాలు తీసుకోవాలి

భట్టిప్రోలు: ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు చేయించుకున్న రైతులు ధ్రువీకరణ పత్రాలు ఆర్బీకేలలో తీసుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి సూచించారు. భట్టిప్రోలు మండల విద్యా వనరుల కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ కుందేటి రమేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలి

నిజాంపట్నం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ మురళి తెలిపారు. మండలంలోని అడవులదీవిలో సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ కల్యాణ్‌రాజ, ఆశ వర్కర్ రాజకుమారి పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడులను తక్షణమే నిలుపుదల చేయాలి

భట్టిప్రోలు: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నెల రోజులుగా ఇజ్రాయెల్ సేనలు పాలస్తీనా ప్రజలపై మారణ హోమాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. నిత్యవసరాలను బంద్ చేసి ప్రజలు ఆకలితో చనిపోయేలా చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అంకమ్మరావు, సత్యనారాయణ, అమర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కంటైనర్

బాపట్లటౌన్: బాపట్ల నుంచి వెదుళ్లపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఐస్‌బాక్స్ లోడుతో వెళ్తున్న కంటైనర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న మహిళ మేడిబోయిన వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.